'రాగమయి'

శ్రీ విజయ - రాఘవ

(సెప్టెంబరు సంచిక తరువాయి)

"ఇందులో బావ తప్పేమీ లేదు. మా సంసారం అంటే గిట్టనివాళ్లెవరో బావను యేడ్పించడానికి యిలా వ్రాసివుంటారు" అని మనస్సులో స్థిమిత పడింది. అయినా మొగంలో గగుర్పాటు, కంగారు కనిపించాయి. రఘునాథంకి ఆ సూచనలన్నీ సూక్ష్మంగా అర్థమైనయి. ఇంతలో రాగమయి లేచి వెళ్లుతుండగా - "ఎందుకో బాధపడుతున్నావ్ పాపా" అన్నాడు. రాగమయి మెట్లుదిగుతూ "అబ్బే! యేంలేదు బావా! వస్తా" అంటూ గదిలోకి వెళ్ళి పడుకొంది.

5

రఘునాథం ఒక్కడే వాకిటరుగుమీద కూర్చొని యేవో తెగని సమస్యల్ని గురించి ఆలోచిస్తున్నాడు. 'ఎవరో!?' రఘునాథంకోసం వచ్చారింతలో. అతన్ని లోపలికి రమ్మనమని ఆహ్వానించాడు.

"ఫరవాలేదులేరా! నీ భోజనమైందా"! అని అడిగాడు. ఇప్పటికిగాని గుర్తురాలేదు రఘునాథానికి ఆ వచ్చిందెవరో - చిరునవ్వొకటి నవ్వాడు. "ఆ ... యిప్పుడే అయింది మామయ్యా!" అన్నాడు. "అయితే అలా పోదాంరా. కాసేపు మాట్లాడుకొద్దాం..." అంటూ రఘునాథాన్ని బయటికి తీసికెళ్లాడు. ఇదంతా రాగమయిచూసి సుందరమ్మ దగ్గరకు ఆదుర్దాగావచ్చి కూర్చుంది. అప్పటికి తొమ్మిదిగంటలయింది. అందరూ అన్నాలుతిని సావకాసంగా కూర్చొన్నారు. రామాలయంలో యింకా భజనలు చేస్తూనేవున్నారు. రాగమయి రావడంచూసి—

"యేమిటేపాపా! పరుగెత్తుకొచ్చావ్" అంది సుందరమ్మ.

"నాకు నిద్రపట్టడంలేదే!" అంది రాగమయి.

"కాసేపు యేదైనా చదువుకోకూడదూ. వచ్చిన కాస్త చదువూ మరిచిపోవాలా!" అంది సుందరమ్మ.

శ్యామసుందరి యిదివరకటి మల్లే మాట్లాడ్డంత తగ్గించింది. గట్టిగా మాట్లాడితే దగ్గుతెరవస్తుంది. అవసరమైనప్పుడు క్లుప్తంగా మాట్లాడటం జరుగుతోంది.

"పాపా! నా పుస్తకాలన్నీ యేపెట్టెలో పెట్టావ్" అంది శ్యామసుందరి బత్తాయికాయితోలు తీస్తూ.

"నీ పుస్తకాలు - నా పుస్తకాలు అమ్మ పెట్టెలో సర్దాను అక్కయ్యా!" అంది రాగమయి.

"అమ్మా! మనం రేపెప్పుడే వెళ్ళేది?" అంది శ్యామసుందరి.

రాగమయికి భయంవేసింది. నోరుజారి విషయమంతా ప్రాక్కుస్తుందేమోనని. రాగమయికి దొరికిన ఆ చిరిగిన వుత్తరం శ్యామసుందరి చదివిన తరువాత ఒక్క నిముషంసేపుకూడా ఆ యింట్లోవుండే తలంపు వెనుకంజవేసింది. మా సంసారం మూలంగా నిష్కళంకమైన రఘునాథం బావకి అపవాదులు తెచ్చిన వాళ్లమవుతున్నాం. మనం తప్పకుండా యీ యింట్లోంచి వెళ్ళిపోవడం మంచిదనే దృక్పథంలోనే వుంది శ్యామసుందరి. కాని యిదంతా యిలా జరిగిందని రాగమయిగాని, శ్యామసుందరిగాని చెప్పలా. ఆ వుత్తరం యెవరు బావకు వ్రాసిందీ తెలియలేదుగాని, విషయం అంతా బాగా అర్థంచేసుకొన్నారు. తెలుసుకున్న సంగతులేవీ తేలకముందే రాగమయి అర్థరాత్రివేళ వెన్నెల్లో బయలుదేరివెళ్ళి రఘునాథంతో ముఖాముఖిగా మాట్లాడి తేల్చుకొద్దామని అభిప్రాయపడింది. కాని, తీరా, వెళ్ళిన తరువాత బావను చూడంగానే తనలో అడగవలసినవన్నీ

అణిగిపోయాయి. పిల్లిలాగా డాబాదిగివచ్చింది. యిదంతా రాగమయి ముఖంద్వారా శ్యామసుందరి విన్నది. రాగమయిని యిలా ప్రోత్సాహపరిచింది శ్యామసుందరే. "దీని కంతటికీ తానే బాధ్యుడనని చెప్పతాడేమో" అనుకొంది శ్యామసుందరి. తను తలపోసిన ఉద్రేకరూపంలో రాగమయి సమాధానాలు లేవు. "సుందరమ్మకు తెలియకుండా యెంతకాలం యీ విషయం కప్పిపుచ్చగలం" అని రాగమయి - శ్యామసుందరి కాసేపు ఆలోచించారు. "ఒకవేళ బయటపెడదామా! అమ్మ సామాన్యమైన మనిషి కాదు. తల్చుకున్నదంటే అదే దారి. వున్నపాళాన లేచిపోతున్నా అనే వదంతిగా లేచి వీధిలోకివస్తుంది. ఒక్కసారి మంచో, చెడ్డో నమ్మిందంటే అదే యిక అంతాను. ఎంతమంది చెప్పినా దానిమాటే దానిది. ప్రయాణం సంగతి చూడబోతే యింకా రెండు రోజుల్లో వుంది. రఘునాధం డబ్బుయిస్తేగాని వీల్లేదుగా అన్నట్లు సుందరమ్మ కలవరిస్తోంది. యిది యెలా పరిష్కారం అయ్యేది!" రాగమయికి దారి తెన్నూ తోచటంలేదు.

"అమ్మా! తెల్లవారుఝామునే ఒక బండివుంది దానికివెడితే హాయిగా వుంటుంది. నాలుగున్నరకల్లా నే లేపుతాను. అన్నీ సిద్ధంచేసి వుంచావుగాదే పాపా!" అంది శ్యామసుందరి రాగమయివంకా, సుందరమ్మవంకాచూసి.

"అదేమిటే శ్యామా! అంత తొందరేం. రేపే వెళ్ళడమేమిటి? ఎల్లుండిగా అనుకొంది వెళ్ళడమని!" సుందరమ్మ ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

రాగమయి మెదలకుండా యిద్దరిమధ్యా సతమతమవుతూ వూరుకూర్చుంది.

రఘునాధం యింకారాలేదు.

"ఎల్లుండిదాకా యెందుకూ! అనవసరంగా యిక్కడ. యేలాగో పోయేవాళ్లంగదా! యింకా ఆలస్యమెందుకూ!" అంది శ్యామసుందరి కోపంగా.

"అంత తొందర పనికిరాదే. రఘునాధం బావ యిస్తానన్న డబ్బు యింకా యివ్వలేదుగదా! అతను కూడా తప్పకుండా మనతోపాటు వస్తానన్నాడు. యింతకాలం అతనింట్లోవుండి, అతనిసొమ్ము మన సొమ్ముగా వాడుకొని బ్రతికినవాళ్లం, యీ రోజున మన అవసర నిమిత్తంగా తొందరపడి అతనిమాట లెక్కసేయకుండా వెళ్ళిపోతే ఏంబాగుంటుంది. అతని కెలావుంటుందో తెలుసా!" అంది సుందరమ్మ మమకారంగా.

రాగమయికి సుందరమ్మ అన్న మాటల్లో అబద్ధమేమీకనిపించలేదు. శ్యామసుందరి ఆ మాటల్ని ప్రస్తుతం విలువకట్టలేని స్థితిలోవుంది.

"రఘునాధం అంటే నీకు యిష్టంలేకపోతే లేకపోవచ్చు. కాని నాకుంది. నేనేం మూఢురాలను కొన్నావా! మనకెంతో సహాయంచేసాడు. మనకింతకాలం ఆశ్రయంయిచ్చి కాపాడాడు. అయినవాళ్లువున్నారని మురిసిపడ్డాం. అపవాదులపాలు కాకుండా ఆదరించాడు." అని సుందరమ్మ ఆగకుండా చెప్పుకుపోతుంటే శ్యామసుందరికి ఉద్రేకం ఒక్కసారిగా పొంగివచ్చింది.

"రఘునాధం బావమీద నువ్వనుకొన్నట్లు హేయభావం యేమాత్రమూలేదు. అతను చాలా మంచివాడే. అతని వుపకారాలు నేను తెలుసుకోలేదనుకోకు. ప్రపంచమంతా రకరకాలుగా నన్నుగూర్చి విమర్శలు జరుపుతున్నా, తలెత్తుకొనే పంతులమ్మ చదువు పూర్తిచేసి వుద్యోగంచేస్తున్నా. పాప చదువు పూర్తిచేసింది. అతనివల్ల మనం నష్టపడిపోతున్నామని నేనను. రఘునాధం బావ యీ క్షణంలో వున్నట్లయితే నేనుపడే బాధను ముఖతావ్యక్తంచేసేదాన్ని. తేలవల్సిన విషయం అతనివల్లే తేల్చుకొనేదాన్ని. యేదియెలాగున్నా, బావ డబ్బు యిచ్చినా, యివ్వకపోయినా, ప్రయాణం మాత్రం తెల్లవారుఝామునే జరిగితీరవలిసిందే. ఎందుకు చెబుతున్నానో చెబుతున్నా. అంతగా వినాలనివుంటే రైల్లోనే చెబుతాను. యీ యింట్లో కాస్తకూడా బయటపెట్టను" శ్యామసుందరి మధ్య మధ్య దగ్గుతూ, రొప్పుతో

యిలా చెప్పడం సాగించింది. అక్కయ్య మాటలు వింటూంటే రాగమయికి వణుకు పుట్టింది. సుందరమ్మకు యేటూ తోచలేదు.

"ఊరుకోవే అక్కా" అంటూ రాగమయి, ఒకటి రెండుసార్లు దగ్గుతూంటే మంచినీళ్లు అందించింది శ్యామసుందరికి.

సుందరమ్మకు, శ్యామసుందరి అన్నమాటల్లోగల అర్థం మాచాయగా బోధపడినట్లు రాగమయి గ్రహించింది.

"అమ్మా! కావాలంటే ..." యిక రాగమయి చెప్పలేకపోయింది తరువాతిమాట.

"ఏమిటది?" అంది సుందరమ్మ అక్కడికీ.

"యేమిటా! యిదిగో చదువూ..." అంటూ శ్యామసుందరి తలదిండు క్రిందవున్న వుత్తరంముక్క సుందరమ్మవొళ్లోకి గిరాటు వేసింది.

రాగమయి సాంతం చదివి - "ఎంత కష్టంగా బావని యేడ్పిస్తున్నానో ఆలోచించు. యింత ఆస్తి వుండికూడా బావ సుఖపడలేకపోతున్నాడంటే యిదే బలమైన కారణం. అందుకే బావ యీ అపవాదులన్నిటిని భరాయించలేక మన కుటుంబాన్ని దూరంగా వుంచి, సాకుతామని ప్రయత్నిస్తున్నట్లు నాకు తెలిసిన పరిస్థితుల్లోనే, సమయానుకూలంగా అక్కయ్యకు జబ్బువచ్చింది. అందువల్ల బావ యీ నాడు మనల్ని దూరంచేసినా, అపవాదులేమీ అతనికి అంటురావు. మనంవుండి అతన్ని సుఖపెడ్తున్నాం అనుకొంటున్నాం. కాని నిజంగా అది లోకం దృష్టిలో ప్రతిరూపంలో వ్యతిరేకంగావుంది. అతను చేస్తానన్న సహాయం మన మొక్కడున్నా చేయకమానడు. తన నోటంట తాను వెళ్ళమని చెప్పలేక యెంతగా బాధపడుతున్నాడో! ఎవరికి తెలుసు. ఇటువంటి వుత్తరాలు అతనికి లోగడ యెన్నివచ్చి యేడిపిస్తున్నాయో! అందుకే యెప్పుడూ ఆలోచిస్తూ కూర్చుంటాడు. అతని స్థితిని యిప్పటికైనా గ్రహించగలిగాం కాబట్టే తొందరగా తప్పుకోవడం మంచిది. అందుకే అక్కయ్య తెల్లవారుఝామునే వెళ్లిపోదామని పట్టుపట్టి కూర్చుంది."

అని రాగమయి చెప్పటం ముగించి, శ్యామసుందరివంక చూసింది. శ్యామసుందరి యేదో చెప్పదామనుకొంటూండగా దగ్గుతెర యీ సారి దీర్ఘంగా వచ్చింది. పొత్తికడుపులోని పేగులన్నీ ఒక్కసారిగా తెగి, పోగుబడ్డట్లుగా అయింది. కళ్ళవెంట నీరూరింది.

రాగమయి యీ లోపుగా మంచినీళ్లు తెచ్చిచ్చింది. గటగటమని తాగి తలదిండుమీద వాల్చింది.

సుందరమ్మ ఆ వుత్తరం అంతా చదువుకొని మరొక్కసారి, శ్యామసుందరి చెప్పినమాటల్లోను, రాగమయి అన్నమాటల్లోను అర్థంయేమీ లేదా లేదన్నట్లుగా నమ్మింది. కళ్లు చెమ్మగిల్లినయి.

ఏంచేస్తుంది? ఎవర్నంటుంది? రఘునాథం అంత పొద్దుపోయినా యింకా రాలేదు.

ఇదంతా జరిగేటప్పటికి తాలూకాఫీసులో రెండు గంటలు కొట్టారు.

6

ఇల్లు తాళం వేయబడి వుండటంచేత రఘునాథం ఆశ్చర్యపడి వెళ్ళిపోయారనుకొన్నాడు. కాని అంతలోకే మరో రకమైన ఆలోచన పూరింది. నేను కావలసిన పైకంకూడా యిస్తానన్నాను. అదైనా పుచ్చుకోకుండానే వెళ్ళిపోయారు. మర్నాడుగదా! ప్రయాణ మనేది. "ఆ అభిప్రాయంతో వుంటం వల్లనూ, ఎవరో కాకుండా మేనమామ వెంకట్రావు వస్తేనూ, అతనితో యేదో తెల్లవార్లూ మాట్లాడుకొంటూ వుంటం వల్లనూ రాత్రి రాకపోయేసరికి, మర్నాటికల్లా యింటికి తాళం వేసి వెళ్ళిపోతారా! ఇదంతా చూస్తే గమ్మత్తుగా వుందే!

"యిప్పటికైనా రఘునాథంకి సుందరమ్మంటే అసహ్యం పుడుతుందేమో! తాను చెప్పిన మాటలు కొంత వరకు ఒంట బట్టినట్లవుతయి" అని ప్రక్కన వున్న వెంకట్రావు ఆపోహ పడ్డాడు. అతను అంత దూరంనుండి కష్టపడి వచ్చిందందుకే అసలు, ఆ అభి

ప్రాయం కలిగిద్దామనే. కాని అటువంటిదేమీ రఘునాథానికి కల్గక పోయేసరికి వెంకట్రావు కెలా వుండాలి! ఒక్క మారుగా తానిటువంటి ఘన కార్యం చేయడానికి వచ్చానంటే యేం బాగు. అందుకే వెంకట్రావు హోటల్లో భోంచేసి రఘునాథం యింటికివచ్చి, అలా పోదాం రమ్మని తీసికొనిపోయి రాత్రల్లా ఆ దేవాలయం మండపంలో తిష్ఠ వేయించి, అక్కడికే పరుపులు తెప్పించుకొని, యెట్టి పరిస్థితుల్లోనూ కదల నివ్వకుండా చేసి సుందరమ్మ సంసారాన్ని గురించి, ఆమె పిల్లల్ని గురించి, యింకా యేమేమిటో వున్నవి కొన్నీ లేనివి కొన్నీ నిద్ర చెడగొట్టి రఘునాథానికి నూరిపోశాడు. వినకుండా యెలా వుంటాడు రఘునాథం. వెంకట్రావు తన దృష్టిలో వింటున్నాడనే అనుకొంటాడు. వినిపించాలనేగా వచ్చింది వెంకట్రావు. రాక రాక మేనమామ వచ్చాడంటే రఘునాథానికి గౌరవంచూపుతున్నాననే వుంది. వెంకట్రావు మాత్రం చెప్పడం జరుగుతోంది గాని, అతను వింటున్నాడో, లేదో వెంకట్రావు కేం తెలుసు. మేనమామ చెప్పే మాటలకు విరుద్ధమైన హావ భావములు ప్రకటించకుండా, అనుకూలంగానే వుంటూ, ఆ రాత్రి యెలాగో గడిపేశారు. మర్నాడు యిద్దరూ కలిసి, యింటికివచ్చి చూస్తే యేముంది? సింహద్వారం తలుపులు రెండూ పెద్ద మంద్రగబ్బంత తాళంతో బంధించబడి వున్నాయి.

“తన మనస్సుని విఱగ్గొడదామని యెన్నో వుత్తరాలు వ్రాసిన మేనమామ వెంకట్రావు వచ్చి తనకూ-తన మేనత్త సంసారానికి విభేదాలు కల్పించి, ఆవిడ అవినీతి పరురాలిగా బ్రతుకుతూ వచ్చిందని, ఆమె పిల్లలయిన శ్యామసుందరి, రాగమయి కామేశ్వర రావుకి పుట్టలేదని, కావాలంటే ఆ పిల్లలకు-తల్లికి పదిమంది ఎదురుగా పోలికలు లేవని చూపుతానని, పూర్వం చేసిన యిటువంటి అవినీతికరమైన పనులు వెనుక నుంచుకొని, వాటిని కప్పిపెట్టుకుంటానికి నీ పంచజేరి కాలం వెళ్ళబుచ్చుతోందని, నీ మేలు కోరే ఆనాడలా వుత్తరం వ్రాసి, యీ రోజిలా బయలుదేరి వచ్చానని” మొదలు గాగల వివయాలన్నీ ఒక్క సారిగా గుర్తుకొచ్చేసరికి వెంకట్రావు మీద యీ క్షణం నుంచీ తనే విధంగానూ గౌరవ ముంచకూడదనీ, అసలతనంటే అభిమానం చూపకూడదనీ, అనుకున్నాడు రఘునాథం.

వెంకట్రావు ఆనాడు తనకోసం రాత్రిపూట వచ్చినప్పుడు రాగమయి ఎందుకో వంటయింట్లోకి వసారాలోంచి పరుగెత్తింది. అప్పుడు చూశాడు గాని, అంతగా పట్టించుకోలేదు. నేనైతే ఆ సమయంలో వెంకట్రావుని గురించి గ్రహించలేక పోయాను గాని, సుందరమ్మ, పిల్లలు యెందుకు గ్రహించకుండా పోతారు! అయినా వెంకట్రావు వచ్చాడన్నంత మాత్రంతోనే యిల్లు కాళీచేసి తాళం వేసి వెళ్ళిపోవాలా! ఎటువంటి బద్ధ వైరం వుంటేమాత్రం, కనీసం నే నొచ్చేంతవరకైనా వుండకుండా వెడతారా! యిస్తానన్న పైకాన్నికూడా లెక్ఖచేయకుండా సుందరమ్మ పిల్లలతో రైలెక్కింది.”

రఘునాథంకి ఆలోచించడం బాగా అలవాటైంది. యీ అలవాటు రాను రాను విపరీతమైపోయింది. సమస్యలు యే విధంగానూ తెగడంలేదు. వెంకట్రావు యింతలో ప్రక్కన వుండి యేదో సణుగుతూనే వున్నాడు. కాని రఘునాథానికవేమీ వినిపించడం లేదు. ఎక్కడికి వెళ్ళిందీ యిదమిద్ధంగా తేలడం లేదు. ప్రొద్దెక్కుతోంది. కడుపులో పేగులు అరుస్తున్నయి. నిస్సారత శరీరమంతా వ్యాపించుతోంది. వసారాలో రెండుమూడుసార్లు అటూ-యిటూపచార్లు చేసేటప్పటికి, ఒక కుఱ్ఱోడు తాళం చెవులు తెచ్చి యిచ్చి వెళ్ళాడు. రఘునాథం ఆ తాళం చేవుల వంక దీనంగా చూస్తూ, వెళ్ళి తాళం తీశాడు. రఘునాథం మాత్రం లోపలికి జొరపడ్డాడు. తర్వాత వెంకట్రావు వెడదామనుకొన్నాడు వెంట. కాని యెందుకో వూరుకున్నాడు. రఘునాథానికి యెన్నడూరాని కోపం హఠాత్తుగా కట్ట తెంచుకొని ముందు కురికింది.— గబాల్నన బయటికొచ్చి—

“సుఖ పడుతున్న కాపురానికి చిచ్చు పెట్టావయ్యా!” అన్నాడు.

వెంకట్రావు కొయ్యబారిపోయాడు. ఇలా అంటాడని అతనెప్పుడూ తల్చలేదు.

ఇల్లంతా కలయ చూశాడు రఘునాథం. యెక్కడ సామాను అక్కడేవుంది. గడియారం మాత్రం మేల్కొనివుంది. సుందరమ్మకు సంబంధించిన వస్తు సామాగ్రిమాత్రం కనిపించలేదు. యిల్లంతా రఘునాధాన్ని చూసి ఒక్కసారి బావురుమంది. రాగమయిని మొట్టమొదటి సారిగా 'పాపా' అని పిల్చినచోటు కనిపించింది. అక్కడ రాగమయి రూపం నిర్జీవంగా కనిపించలేదు. తన పెట్టె దగ్గరకుపోయి చూశాడు. డబ్బు ఆ పాళానే వుంది. ఒక చిల్లి గవ్వకూడా పోలేదు. అంత మాత్రానికి రఘునాథం చిల్లికాని యెత్తుకూడా ఆనందపడలేదు.

“ఎవరికోసం యింత డబ్బు దాచి వుంచానో అది యీ రోజున వాళ్ల వుపయోగానికి వినియోగించలేకపోయాను.” అని అంతరాత్మ పెదవి విరిచి మాట్లాడినట్లు పల్కింది. రఘునాధం ఒక్క నిముషం ఆ స్థలంలో ఆ సమయంలో వుండలేక పోయాడు. చరచరా బయటికి వచ్చేసి నుదురుమీద చెయ్యి పెటుకొని వెంకట్రావువంక చూస్తూ — “ఎంత పని చేశావయ్యా!” అన్నాడు. వెంకట్రావు “ఇదేమిటీ!” అని తెల్ల మొగం వేసాడు. కాని నోరు పెకల్లేదు. అతని ముఖం వంక అట్టే సేపుకూడా యిదివరకటి మాదిరిగా చూడలేకపోయాడు. రఘునాధంకి హృదయాంతరాళంలోంచి పొంగివచ్చే అవ్యక్తమైన సంగతుల్ని నోరుమూసుకొని, బిగపట్టి ఒక చోట చతికిల పడ్డాడు. ఎంత సేపటికీ ఒక నిశ్చితాభిప్రాయాన్ని సూచించే సమాధానం రఘునాధం నుండి రాకపోయేటప్పటికి, అటూ — యిటూ పరకాయించి చూసి, నెమ్మదిగా లేచి —“అయితే... వెళ్లొస్తాను... కంపెనీ బస్సుకూడా వచ్చే వేళయినట్లుంది... అయిన వాణ్నిగదా అని యేదో తోచింది చెప్పి పోదామని వచ్చాను. అంతే ... నువ్వో వ్యక్తత వచ్చినాడవే. మిగతా భారమంతా నీకే వొదిలి వెడుతున్నాను. తరచు వుత్తరాలు వ్రాస్తూవుండు...” అంటూ వీధిలోకి వెళ్ళబోతుండగా, రఘునాధంకి కొన్ని అసంపూర్ణ ఆలోచనల్లోంచి మెలకువ వచ్చి “చాలా సంతోషం. వెళ్ళిరా మామయ్యా!” అందామనుకొన్నాడు వ్యంగ్యంగా. కాని మనసొప్పలేదు. అయినా బదులు చెప్పవలసిన బాధ్యత తనకుందిగా! అనే భావంతో “మంచిది” అని సూక్ష్మంగా అన్నాడు.

వెంకట్రావు గొడుగు చంకన బెట్టుకొని రఘునాధం అన్నమాట వినట్లో, వినిపించుకొన్నట్లో, వెనక్కికూడా తిరక్కుండానే వెళ్లిపోయాడు.

గాలికి వీధి తలుపులు దభేలుమని దగ్గరకు కలుసుకొన్నాయి.

రఘునాధం ఒక నిట్టూర్పు బరువుగా వొదిలాడు. బిగపట్టి లాగి వొదిలిన కొబ్బరి మట్ట రివ్వునపోయి మరొక మట్టకు తగలగా, స్వాతంత్ర్యం వచ్చిందని కొబ్బరాకులు కిల కిల మని నవ్వినట్లు ఒక శబ్దం సుకుమారంగా వినిపించింది. రఘునాధం చొక్కా గుండీలు వొదులు చేసుకొని, గుండెమీద పట్టిన చిరు చెమటకు గాలి సూదాడు.

7

సుందరమ్మ కుటుంబం వేరుగా బ్రతుకుతోందని చుట్టాల్లోకి బాగా పాకిపోయింది. కొందరా విషయానికి విశ్రాంతి తీసుకొంటున్నట్లుగా భావించారు. కొందరికి జాలివేసి, సానుభూతి చూపుదామనుకొన్నారు. అయితే రఘునాధంమీద యెక్కువ అపనిందలు మోపపడలేదు. చాటు చాటుగా అనుకొంటూనే వున్నారు. “వాడెందుకు వూరుకొంటాడు. రాగమయి మీద మనసుని యీనాడు పోగొట్టుకోమంటే పోగొట్టుకుంటాడా! సుందరమ్మ వాడికి మత్తు మందు పెట్టి మనసు మార్చి వేసింది. ఏ విధంగానైనా వాళ్ళకు సాయం సేయక మానడు.”—అని.

శ్యామసుందరి క్షయాసుపత్రిలో చికిత్స పొందుతోంది. రాగమయి, సుందరమ్మ వేరుగా ఒక చిన్న గది అద్దెకు తీసుకొని కాలక్షేపం చేస్తున్నారు.

కామేశ్వరావు బ్రతికివున్న రోజుల్లో కష్టార్జితంమీద చేయించుకొన్న నగలన్నీ క్రమేపీ మార్వాడీ కొట్లమీదకు వెళ్ళిపోతున్నాయి. మొదట్లో రాగమయి ఖాళీగానే వుంటూ వచ్చింది. కొన్నాళ్ళవరకు యిలా వుండగా ఒకనాడు రాగమయి బజారుకుపోయి శ్యామసుందరికి బత్తాయిలు, నారింజలు కొని తీసికెళ్ళివ్వడానికి ఆస్పత్రికి వెళ్ళింది. డాక్టరు కృష్ణమోహన్‌తో శ్యామసుందరి యేవో జీవిత సంఘటనల్ని చెబుతోంది కృష్ణమోహన్ "ఊ" కొడుతూ వింటున్నాడు. రాగమయి రావడం కృష్ణమోహన్ చూసి, శ్యామసుందరితో — "మీ చెల్లాయి వచ్చిందన్నాడు."

"ఇలా రావే పాపా" అంది శ్యామసుందరి.

"అయితే ఆ పండ్లు రసం తీసి పుచ్చుకొంటారు గదూ!" అంటూ కృష్ణమోహన్ వెళ్ళిపోయాడు. రాగమయివచ్చి శ్యామసుందరి దగ్గరగా కూర్చొని "రసం తీసి యివ్వనా?" అంది. "ఇప్పుడొద్దులే! కాసేపు వుండు" అంది శ్యామసుందరి. రాగమయిని చూస్తే శ్యామసుందరికి యెందుకో! కళ్లవెంట నీళ్లు పారినయి. "ఎందుకక్కా! యేడుస్తున్నావ్" అంది. "అబ్బే! యేం లేదే! యేదో జ్ఞాపకం వచ్చింది. అంతే... నిజంగా డాక్టరుగారు యెంత మంచివారను కొన్నావ్. యీ సీసా యివాళ ఆయనే కొనిచ్చారు. నే నింత ఖరీదు గలది కొనుక్కోలేనండీ అంటే అమ్మకి చెప్పి యీ రోజునుంచి క్రొత్తమందు మొదలుపెట్టారని" అంటూ శ్యామసుందరి చెప్పుకొస్తుండగా రాగమయి, యింటికి వెళ్ళడానికి లేచింది. "చెల్లాయి! వూరికే కూర్చొపోతే నలుగురైదుగురాడ పిల్లలకు ప్రయివేటు చెప్పకబోయావా!" అంది.

రాగమయికి యీ ఆలోచన రఘుసాధం యింటివద్దనుండి బయలుదేరి, తెల్లారు ఝామున రైల్లో వస్తూండగానే తట్టింది. కాని, పరిస్థితులు ఒక విధంగా స్థిరపడితేనేగాని, యిటువంటి పనులకు వీలు దొరకదని ఆగి వూరుకొంది. యిప్పుడు శ్యామసుందరి ఆ విషయం గురించి అనంగానే, రాగమయికి తళుక్కున మెరిసింది. వెంటనే "సరే అక్కయ్యా! నేనూ యిలా చేద్దామనే లోగడ అనుకొన్నాను." అంటూ నెమ్మదిగా శ్యామసుందరి విడిచిన బట్టల్ని సంచిలో పెట్టుకొని యింటికి దారి తీసింది.

శ్యామసుందరికి రాగమయి చేయబోతున్న కార్యం తెల్సుకొని సంతోషపడింది. డాక్టరు కృష్ణమోహన్‌కి కూడా ఆనాడే తెల్పింది. యిద్దరూ వొకళ్లొకళ్ళ మొగాలు చూసుకుని నవ్వుకొన్నారు. రాగమయి యింటికివచ్చి సుందరమ్మతో తాను చేయబోయే విషయం గురించి చెప్పగానే గడిచిన జీవితాన్ని స్మృతికి తెచ్చుకొని కంట నీరెట్టుకొంది. రాగమయి బేలగా మారిపోయి —

"వూరుకోమ్మా! అన్నీ తెలిసినదానివికూడా యిల్లా అయితే యింకేమిటీ?" అంది.

(సశేషము)

డాక్టరు కే. యన్. కేసరిగారి రచన

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 3-0-0 — పోస్టేజి ఉచితం

అన్ని హిగిన్ బాదమ్స్ స్టాల్సులోను దొరుకుతవి.